# 4. నష్టపరిహారం

నాతో బాటు కాలేజీలో చదువుతూ ఉండేవాడు; రంగధాం అని. ఇప్పుడెక్కడున్నాడో తెలీదు కాని, అతనికి ఇంటర్ సెకండియర్ చదువుతూ ఉన్నప్పుడే గెడ్డం మొలవడం ప్రారంభించింది. "ఎదగడానికెందుకురా తొందర; ఎదర బ్రతుకంతా చిందర వందర" అనే పాట ఆ రోజుల్లో లేదు. అంచేత గెడ్డం మొలుస్తున్నందుకు కొంచెం చీదరగా ఉన్నా పెద్దవాడి నవుతున్నాననే సరదా గెడ్డంతో పాటే మొలవడం పెరగడం ఆరంభమైంది మా రంగధాంకి.

పెరుగుట విరుగుట కొరకే అన్న సూక్తి గెడ్డానికి వర్తించినంత చదునుగా ఇంక దేనికీ వర్తించదనుకుంటాను. ఇద్దరమూ రూం మేట్స్ కదా, పళ్లుతోముకోవడం, మొహం కడుక్కోవడం రాత్రి 'పిడి' పట్టిన మేటర్ కంఠస్థం అయిందా లేదా అని సరి చూసుకోవడం ఇలాంటి వాట్లో నేను తలమునకలవుతున్న సమయంలో రంగధాం ఒక అద్దం ముందరేసుకొని కూచుని గెడ్డం తడుముకుంటూ అదో ఫెంటాస్టిక్ వరల్డ్‌లోకి వెళ్ళిపోయేవాడు. "అలా చూసుకుంటూ కూర్చోకు; టైం వేస్టు." అని నేనంటే అరమోడ్పు కళ్లతో "తీస్తున్న కొద్దీ పెరిగేదీ ఏమిటిరా, గోపాలం?" అని అడిగేడు. "గొయ్యి" అన్నాను. "కాదు. మరో ఛాన్సు ఇచ్చాను, ఆలోచించి చెప్పు" అన్నాడు.

"అప్పు"అన్నాను. "ఓరి నీతెలివి తెల్లార! తీస్తున్న కొద్దీ పెరిగేది గెడ్డం రా!"అన్నాడు. "ఇంకేం, తీసినా పెరుగుతుంది కదా? తియ్యడం మొదలెట్టు" అన్నాను.

అలా ప్రారంభమైన రంగధాం గెడ్డం ఖండనోదంతం ఒకనాడు అతను గెడ్డం గీసుకుంటూ ఉండగా చెంప కొంచెం తెగడంతో ఒక కొత్త మలుపు తిరిగింది. ఇప్పట్లాగ అప్పుడు స్టెయిన్ లెస్ స్టీలు బ్లేడులు లేవు. బాగా డబ్బు ఖర్చుపెట్టగలిగిన వాళ్లకి ఇంగ్లాండులో తయారయిన బ్లేడులు దొరికేవి. అయితే గెడ్డం గీస్తున్నప్పుడు హస్తవాసిలో చిన్నతేడా వస్తే చెంప కొయ్యడంలో ఫారిన్ బ్లేళ్లూ, ఇండియన్ బ్లేళ్లూ అన్న తేడా ఉండదు కదా. ఆ విధంగా మన నిత్య జీవితంలో కనీసం ఒక్కచోటైనా ప్రాక్పశ్చిమ విభేదం లేని అంశం ఉంది కదా అని ఎంతో ముచ్చట పడిపోయేవాళ్ళం.

తనంతట తాను గెడ్డం గీసుకోవడంలో ఖర్చు ఎలాగా తప్పదు, పైగా టైం ఎక్కువ పట్టేస్తోందని, చెంప మీదనో, గెడ్డం కిందనో గాటు పెట్టుకునే రిస్కు కూడా ఉందని గ్రహించిన రంగధాం ఒకనాడు కాలేజీకి పావుగంట ముందుగా బయలు దేరి, ఒక "ఆయుష్కర్మశాల" లో దూరేడు. "ఇప్పుడే వెళిపోదాం ; రా నువ్వుకూడా!" అన్నాడు కదాని నేనూ వెళ్ళాను. ఆ లోపల ఒక రౌండు కుర్చీ, ఒక బెంచీ ఉన్నాయి. "ప్రతి **మంగళ్ల వారము** శెలవు" అని బోర్డుంది. "మేము క్షుర కర్మ చేయు సమయములో మీకు కత్తిగాటు పడినచో మీకు నష్టపరిహారం లభించును". అని ఇంకో బోర్డున్నాది. రంగధాం రౌండు కుర్చీలో కూర్చుంటూ, ఆర్టిస్టు తన మెడ మీదుగా గుడ్డచుట్టి వెనకాల ముడివేస్తున్న సమయంలో "నష్టపరిహారం అని బోర్డు పెట్టేవేంటీ?" అని అడిగాడు, గెడ్డం కన్నా బలంగా లోపల పెరిగిన భయం అట్టే తెలియనివ్వకుండా ఉండడానికి మొహం మీద చిన్న నవ్వు పూసుకొని. దానికి ఆ కర్మచారి గర్వంగా "అదేటి

బాబూ, అలగంతారు? గెడ్డం గీయడానికి మీరిచ్చేది బేడ. గాటు గానీ పడిందా, నానిచ్చేది అర్ధనా. అంతెందుకు, ఉప్పుడే గాదా, ఓ బాబు నాకాడ గెడ్డం గీయించుకుని పావలా ఒట్టుకు పోనాడు!'' అన్నాడు. రంగధాం నావేపు అనుమానంగా చూసేడు. "ఏముంది?బేడా, పావలా కలిపి ఆరణాలు. అంటే మొత్తం పన్నెండు గాట్లు'' అని కంప్యూట్ చేసి చెప్పేసరికి రంగధాం కుర్చీలోంచి గెంతి నా చెయ్యి పట్టుకుని బడ్డీలోంచి కూడా గెంతేడు.

రోడ్డు మీద మోటార్ సైకిలో కారో నడుపుకుని మనం వెళుతూ ఉంటాం. ఒక చోట కాకపోతే మరోచోట అయినా; ఒకనాడు కాకపోతే మరొకనాడైనా, మన వాహనం జనం రద్దీలో ఒక మనిషికి గాని పెంపుడు జంతువుకి గాని మరో చిన్న వాహనానికి గాని తగలొచ్చు. ప్రాణహాని కలిగితే చెప్పలేం గాని, లేకపోతే నష్ట పరిహారం అక్కడికక్కడే నిర్ణయం అయిపోతుంది. ట్రాఫిక్ ఎలాగూ స్థంభించి పోతుంది కదా. ఎక్కణ్ణుంచి వస్తాడో ఒక స్థానిక నాయకుడు; "మీరలా గుండండి.'' "అరే, బాబు గారెటూ ఎలిపోకుండా సూడ్రా.'' లాంటి ఆర్డర్లు వేస్తూ, బాధ ఏమీ లేక లేచిపోతున్న బాధితుణ్ణి లేవనియ్యకుండా అణచిపట్టుకుని "ఇప్పుడీడికి ఆస్పిటల్ కర్చులూ అయ్యా, ఇయ్యా బోల్డవుతాది'' అని జనాన్ని కన్విన్స్ చేసి, మన ఆదుర్దాని బట్టి యాభయ్యో, వందో నష్ట పరిహారం నిర్ణయించి; ఆ డబ్బు కూడా సరాసరి బాధితుడికి ఇవ్వనీయకుండా అడ్డంపడి తనే పుచ్చేసుకుని - ఆ తరువాత ఏం చేస్తాడో మనకెందుకు-మన దార్ని మనని పోనిస్తాడు; అంతే చాలు.

విదేశీ వార్తల్లో కొన్ని ఐటమ్స్ జాగ్రత్తగా గమనిస్తే నష్ట పరిహారానికి సంబంధించిన వార్తలు, చాలా ఆసక్తికరమైనవి వినిపిస్తాయి. రోగికి; ఇయ్యవలసిన మందు కాక మరేదో ఇయ్యడం వల్ల అతని అనారోగ్యం మరింత ముదిరిపోయినందుకు, విమానం అనుకొన్న టైమ్‌కి కాక పావుగంట ఆలస్యంగా చేరడం వల్ల ఒక పెద్ద మనిషి తన బిజినెస్ నష్టపోయినందుకు; పెళ్లిలో తాను ధరించవలసిన సూట్ సరిగా కుట్టనందువల్ల భార్యామణికి తానంటే వెగటు పుట్టి విడాకులకి దారితీసినందుకు; ఒక మాటకి అర్ధం తెలుసుకోవాలని కొనుక్కొన్న నిఘంటువులో అసలు ఆమాటే వెయ్యనందుకు; ఇలా - తమాషాగా కనిపించే కారణాలవల్ల ఎందరెందరో ఎంతెంతో నష్టపరిహారం చెల్లించారని ఆ వార్తల ద్వారా మనకి తెలుస్తుంది. వీట్లో అన్నిటికన్నా చిత్రంగా కనిపించిందొకటుంది. "అర్ధరాత్రి శృంగారం''; "ఆమె కామం'' వంటి అనువాద నామధేయాలు గల మలయాళీ సినిమాలుంటాయి. వాటికి వార్తాపత్రికల్లో వచ్చే ఎడ్వర్టయిజ్‌మెంట్లు, గోడల నలంకరించే వాల్ పోస్టర్లు ఎంతటి ప్రలోభంతో ఉంటాయో చెప్పనక్కర్లేదు కదా. అమెరికాలో ఒక పెద్దమనిషి అలాటి వాల్‌పోస్టరు చూసి ఒకానొక సినిమాకి వెళ్లి; ఆ సినిమాలో తెరమీద ఆ దృశ్యం చూపించలేదని దావావేసి, తనకి అనవసరంగా మూడుగంటల కాలహరణానికి కారకు లయినందుకు ఆ సినిమా కంపెనీ వారు, డిస్ట్రిబ్యూటర్, హాలు యజమానులు కలిసిగాని వారిలో ఒకరు గాని తనకి ఫలానా ఇంత నష్టపరిహారం ఇయ్యవలసి ఉంటుందని కేసుపెట్టి గెలిచాడు.

మనదేశంలోనే ఓసారి ఒక పెద్ద మనిషిని మరొకాయన నడిరోడ్డు మీద లెంపకాయ కొట్టినందుకు కోర్టువారు యాభైరూపాయల నష్టపరిహారం ఇప్పిస్తే; లెంపకాయ కొట్టిన మనిషి చిల్లరలేదని వందరూపాయల నోటు ఇచ్చి ఇంకో లెంపకాయ కొట్టేసి కోర్టులోంచి వెళిపోయాడని ఒక కథ ఉంది.

"ది విశాఖపట్నం రోడ్డు యూజర్స్ నష్టపరిహారం యాక్ట్" అని ఒక చట్టం చేయించ గలిగితే:- మినహాయింపు లేకుండా అన్ని రోడ్లమీద యాభయ్యేసి అడుగులకి ఒక గొయ్యి చప్పున ఉండడం వల్ల:

రైల్వే స్టేషన్ జంక్షన్, చావుల మదుం జంక్షన్, నేవల్ డ్రైడాక్ రోడ్డు, కొబ్బరి తోట బైపాస్ రోడ్డు లాంటి ఎన్నో చోట్ల తారురోడ్లు అలవాటుగా వర్షంలో కొట్టుకుపోతూ ఉండడం వల్ల,

తమ ఇళ్లకి కుళాయిలు పెట్టించుకునే సందర్భంగా గొట్టాలు రోడ్ల కింద నుంచి రావాలి గనుక రోడ్ల భాగాల్ని అడ్డంగా పగల గొట్టిన వాళ్లు తిరిగి ఆ భాగాల్ని సరిచెయ్యలేకపోవడం వల్ల, రోజూ ఎన్నో వాహనాలు టైర్లు పగిలి, రిమ్ములు వొంగి, షాక్ ఎబ్సార్బర్లు విరిగి మెకానిక్కుల దగ్గిరికి చేరుతున్నందుకు-

రోజూ ఎందరో మనుషులు (వాహనాల వాళ్లే కాకుండా నడుస్తున్న వాళ్లు కూడా) ఆ గోతుల్లో పడి కీళ్లో కాళ్లో విరగ్గొట్టుకుని డాక్టర్ల దగ్గిరికి చేరుతున్నందుకు-

మున్సిపల్ కార్పొరేషన్ వారు కోట్లాది రూపాయలు నష్టపరిహారం కింద చెల్లించుకోవలసి వస్తుందేమో -

మేయర్ గార్ని ఎప్పుడేనా కలిసి అడగాలి. ఆయన గొప్ప ఎడ్వకేట్. "మేయరు" అని కూడా ప్రతీతి. (వెనక ఒకాయన ఉండేవారు. ఆయన మేష్టారు.") ★

# 5. నందికేశ్వరుడి నోము

"మీ కుటుంబం మొత్తం ఐదుగురూ తప్పకుండా రావాలి మరి!" అని రెండు చేతుల్తోనూ పట్టుకుని మరీ అందించేడు నా స్నేహితుడు నందికేశ్వరరావు, తన కూతురి పెళ్లి శుభలేఖని.

"అలాగే వస్తాంలే. ఐదుగురూ అంటే పిల్లలు ముగ్గురి సంగతీ గట్టిగా చెప్పలేను గాని నేనూ మా ఆవిడా ఖాయంగా వస్తాం."

"అలాక్కాదు. ఐదుగురూ రావలసిందే!"

"ఎందుకంత యిదిగా చెప్తున్నావు? వస్తాం అన్నానుగా!"

"అలాక్కాదు. మా ఆవిడ నందికేశ్వరుడి నోము పట్టింది అందుకని-"

"మీ ఆవిడ నందికేశ్వరుడి నోము ఇప్పుడు పట్టడమేమిటి; పాతికేళ్లయిందిగా!" అన్నాను నవ్వుతూ; అతని పేరు నందికేశ్వర్రావు కదా అని.

"ఆ నోము కాదోయ్!" అని నందికేశ్వర్రావు కూడా నవ్వేడు. "ఏదో పాతకాలం మనిషి. ఒద్దే అంటే వినదు! నందికేశ్వరుడి నోము తొమ్మిది భాగాలుట. అందులో పరమాన్నం, అప్పాలూ ఉండిపోయాయిట, ఈ పెళ్లిలో అవి రెండూ అయిందనిపించేస్తుందిట-"

ఆ విధంగా నందికేశ్వర్రావు కూతురి పెళ్లికి మేం ఇంటిల్లపాది వెళ్లేం. పరమాన్నం, అప్పాలూ పారెయ్యకుండా వీలున్నంత మేరకి తిని ఆవిడ నోముకి సహాయపడ్డామని తృప్తిగా వొచ్చేస్తూవుంటే